సాక్షి
మెదక్
బుధవారం, 29, జనవరి, 2025



కరాటే శిక్షణ.. ఆత్మరక్షణ

కరాటే శిక్షణ.. బాలికల్లో ఆరోగ్యంతోపాటు ఆత్మ స్థైర్యాన్ని పెంపొందిస్తోంది. బాలికల సమగ్ర పథకం సత్ఫలితాలనిస్తోంది.

వివరాలు 8లో ▸



అఘోరీ హల్‌చల్

కొమురవెల్లి మల్లికార్జున స్వామి దర్శనానికి వచ్చిన అఘోరీ హల్‌చల్ చేసింది. కత్తితో దాడికి పాల్పడింది.

వివరాలు 8లో ▸



నిర్మించారు.. వదిలేశారు

శివ్వంపేటలో ప్రజా అవసరాల నిమిత్తం నిర్మించిన భవనం పూర్తిస్థాయిలో ఉపయోగంలో లేకపోవడంతో పై అంతస్తు నిరుపయోగంగా ఉంది.

వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

ప్రమాదాలు తగ్గుముఖం

ఆర్టీసీ రీజినల్ మేనేజర్ ప్రభులత



ఉత్తమ డ్రైవర్‌ను సన్మానిస్తున్న ఆర్‌ఎం

జహీరాబాద్‌టౌన్: డ్రైవర్లు భద్రత నియమాలు పాటించడం వల్ల ఈ ఏడాది ఆర్టీసీలో ప్రమాదాలు తగ్గాయని మెదక్ రీజినల్ మేనేజర్ ప్రభులత పేర్కొన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా జహీరాబాద్ డిపోలో మంగళవారం నిర్వహించిన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. అతివేగం, అజాగ్రత్తే ప్రమాదాలకు కారణమన్నారు. ప్రమాదరహిత డ్రైవర్లుగా ఎంపికైన శంకరయ్య,వినోదయ్య, పీఎన్ రెడ్డితోపాటు పలువురు ప్రైవేట్ డ్రైవర్లను ఈ సందర్భంగా ఆమె సన్మానించారు. కార్యక్రమంలో బుధేరా గురుకుల కళాశాల ప్రిన్సిపల్ మాధవి, వైస్ ప్రిన్సిపల్ స్రవంతి, డీఎం.జాకీర్ హుసేన్,అసిస్టెంట్ మేనేజర్ ప్రవీణ్ కుమార్, సూపర్‌వైజర్ తిరుమలేశ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు రూ.5.37 కోట్లు మంజూరు : ఎమ్మెల్యే

నర్సాపూర్: నియోజకవర్గంలోని రోడ్ల మరమ్మతు కోసం రూ. 5.37కోట్లు మంజూరయ్యాయని ఎమ్మెల్యే సునీతారెడ్డి తెలిపారు. ఎస్ఎన్‌టీ రోడ్డు నుంచి రుస్తుంపేట, మూసాపేట, నాగులపల్లి మీదుగా సికింద్లాపూర్ వరకున్న 9 కిలోమీటర్ల 53 మీటర్ల రోడ్డును తారు రోడ్డు చేస్తారన్నారు. పనులు త్వరలో ప్రారంభమవుతాయని ఆమె చెప్పారు.

అంగన్‌వాడీ భవనాల పరిశీలన



చండూర్ అంగన్‌వాడీ భవనాన్ని పరిశీలిస్తున్న హేమభార్గవి

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలంలోని అంగన్‌వాడీ భవనాలను మంగళవారం నర్సాపూర్ సీడీపీఓ హేమభార్గవి, చిలప్‌చెడ్ మండల ఇన్‌చార్జి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంతోష పరిశీలించారు. ఈ సందర్భంగా హేమభార్గవి మాట్లాడుతూ.. మండలంలోని 16 అంగన్‌వాడీ భవనాలను పరిశీలించామని, ఒక్క పానాది తండా అంగన్‌వాడీ భవనం మినహా అన్ని బాగానే ఉన్నాయన్నారు. ప్రస్తుతం పానాదితండా అంగన్‌వాడీ భవనానికి ప్రత్యామ్నాయంగా మరో భవనం దొరకడం లేదని, త్వరలోనే ఆ కేంద్రాన్ని కూడా మరో భవనంలోకి మార్చేస్తామని తెలిపారు.

మహనీయుల చరిత్రను పాఠ్యాంశంగా బోధించాలి



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న జగన్

చిన్నశంకరంపేట(మెదక్): మహనీయుల చరిత్రను పాఠ్యాంశంగా బోధించాలని యూఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు జగన్ అన్నారు. మంగళవారం చిన్నశంకరంపేట ప్రభుత్వ కళాశాల ఆవరణలో క్యాలెండర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహనీయుల చరిత్రను పాఠ్యాంశంగా చేర్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట చిన్నశంకరంపేట కళాశాల విద్యార్థులు ఉన్నారు.

నేటినుంచి దివ్యాంగులకు క్యాంపులు

మెదక్ కలెక్టరేట్: జిల్లాలో దివ్యాంగులకు కోసం బుధవారం నుంచి ఈనెల 31వ తేదీ వరకు ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నట్లు డీడబ్ల్యూ హైమావతి ప్రకటనలో తెలిపారు. అలిమ్‌కో అనే సంస్థ ద్వారా 29, 30, 31 తేదీల్లో మెదక్, రామాయంపేట, నర్సాపూర్‌లలో ఈ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. దివ్యాంగులకు అవసరమైన సహాయ పరికరాలు అందజేస్తామన్నారు. బుధవారం మెదక్ జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీఓ భవన్‌లో జరిగే శిబిరానికి మెదక్, హవేళిఘణాపూర్, పాపన్నపేట, టేక్మాల్, పెద్దశంకరంపేట, రేగోడ్, అల్లాదుర్గ్ మండలాలకు చెందిన దివ్యాంగులు హాజరు కావాలన్నారు. 30న రామాయంపేటలోని రైతు వేదికలో నిర్వహించే శిబిరంలో రామాయంపేట, నిజాంపేట, నార్సింగి, చేగుంట, వెల్దుర్తి, మాసాయిపేట, చిన్నశంకరంపేట మండలాల దివ్యాంగులు, 31న నర్సాపూర్‌లోని రైతు వేదికలో నిర్వహించే శిబిరంలో నర్సాపూర్, మనోహరాబాద్, కౌడిపల్లి, చిలిపిచెడ్ కొల్చారం, శివ్వంపేట, తూప్రాన్ మండలాల దివ్యాంగులకు పరికరాలు అందజేయనున్నట్లు తెలిపారు.

3,99,774 ఎకరాలకే ‘భరోసా’

రైతు భరోసా అమలు చేసేందుకు సాగులో ఉన్న, లేని భూములను గుర్తించారు. ఇటీవల కొన్ని గ్రామాల రైతుల ఖాతాల్లో సొమ్ము జమైంది. ఇంకొన్ని పల్లెల కర్షకులు పెట్టుబడి సాయం కోసం ఎదురు చూస్తున్నారు. ఈసారి భూవిస్తీర్ణం కూడా పెరిగింది. లబ్ధిదారుల సంఖ్య కూడా పెరిగినట్లు తెలుస్తోంది.

21 గ్రామాలకు పెట్టుబడి సాయం
- 472 పల్లెల ఎదురు చూపు
- జిల్లాలో సాగు మొత్తం 4.06 లక్షల ఎకరాలు
- యోగ్యం కానివి 6,869 ఎకరాలు

మెదక్‌జోన్: మెతుకు సీమలో సాగు భూముల లెక్క తేలింది. మొత్తం 4,06,643 ఎకరాల భూములుండగా అందులో 6,869 ఎకరాలు సాగుకు యోగ్యం కానివని అధికారులు తేల్చారు. మిగతా 3,99,774 ఎకరాలకు మాత్రమే రైతుభరోసా ఇస్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గతేడాది 2024 యాసంగిలో సుమారు 3.94 లక్షల ఎకరాలకు గానూ రూ.194.54 కోట్ల రైతుభరోసా ఇచ్చింది. ప్రస్తుతం సాగుకు యోగ్యమైన భూములతో పాటు 10 ఎకరాల లోపు భూములు గల రైతులకు మాత్రమే భరోసా నిధులు ఇస్తామని ప్రకటించింది. గ్రామసభలు పెట్టి రైతుల అభిప్రాయాలను అధికారులు సేకరించారు.

రూ.14.52 కోట్లు జమ

జిల్లాలో 21 మండలాలుండగా 493 గ్రామాలున్నాయి. గణతంత్ర దినోత్సవం సందర్భంగా నూతనంగా ప్రవేశపెట్టిన నాలుగు సంక్షేమ పథకాలను మండలానికొక గ్రామం చొప్పున కేవలం 21 గ్రామాల్లో మాత్రమే పథకాలను లాంఛనంగా ప్రవేశపెట్టారు. అందులోనూ రైతు భరోసా కూడా ఉంది. ఈ పథకం కింద 21 గ్రామాల్లో 14,819 మందికి రూ.14.52 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేశారు. 472 గ్రామాల్లో స్కీం వర్తింజేయాల్సి ఉంది. ఈ నిధులు తమకు ఎప్పుడొస్తాయోనని జిల్లా రైతాంగం ఎదురు చూస్తోంది.



పెరిగిన భూ విస్తీర్ణం

గత భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ప్రభుత్వ హయాంలో భూప్రక్షాళన పేరుతో చిన్నపాటి భూసమస్యలు ఉన్న వాటిని పార్ట్(బీ) నిషేధిత జాబితాలో పెట్టింది. దీంతో చాలా వరకు భూములు లెక్కల్లోకి రాకుండా పోయాయి. కాగా సమస్యలు పరిష్కారమైన వాటిని రికార్డుల్లో పొందు పర్చటంతో జిల్లాలో భూవిస్తీర్ణం పెరుగుతోంది. గతేడాదితో పోల్చితే ఈ యాసంగి 12,463 ఎకరాల మేర భూముల విస్తీర్ణం పెరిగినట్లు అధికారులు రికార్డులు చెబుతున్నాయి.

మురికినీటిలో పుణ్యస్నానాలా?

మంజీరాలో నేడు పవిత్ర మాఘ స్నానాలు
- లక్ష మంది భక్తులు వచ్చే అవకాశం
- వసతుల లేమి.. అరకొర ఏర్పాట్లు



గుర్రపు, డెక్క కలుషిత నీటితో ఆకు పచ్చ రంగులోకి మారిన నీరు

పాపన్నపేట(మెదక్): పవిత్ర మాఘ స్నానాలకు మంజీరా ముస్తాబవుతోంది. ఏడుపాయల్లో బుధవారం స్నానాలు చేసి, దుర్గమ్మను దర్శించుకునేందుకు తెలంగాణతోపాటు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు వస్తారు. ఈ మేరకు సింగూరు నుంచి 0.3 టీఎంసీ నీటిని విడుదల చేశారు. మాఘస్నానాల కోసం చేస్తున్న ఏర్పాట్లు అరకొరగా సాగుతున్నాయి. మాఘస్నానాల కోసం ఏర్పాట్లన్నీ దగ్గరుండి చూసుకోవాల్సిన ఈవో చంద్రశేఖర్ మంగళవారం సాయంత్రానికి కూడా ఆలయానికి రాలేదు.

దర్శనం కోసం ప్రత్యేక లైన్లు

పవిత్ర మాఘస్నానాలకు వివిధ రాష్ట్రాల నుంచి సుమారు లక్ష మంది భక్తులు వచ్చే అవకాశం ఉంది. చారిత్రక నేపథ్యమున్న ఏడుపాయల్లో మాఘ స్నానాలు చేస్తే, ఆరోగ్యం, పుణ్యం లభిస్తుందని భక్తుల నమ్మకం. ఆలయం ముందు భక్తుల సౌకర్యార్థం పెడల్ స్టాండులు. దర్శనం కోసం ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేశారు. వీఐపీ దర్శనంతో పాటు, ధర్మ దర్శనం ఉంటుంది.

నిర్దేశించిన స్థలాల్లోనే స్నానాలు

ఏడుపాయల్లో మంజీర నది ప్రమాదకరంగా బండ రాళ్లతో నిండి ఉన్నందున, భక్తులకు నిర్దేశించిన ఘాట్ల వద్దే స్నానాలు చేయాల్సి ఉంటుంది. భక్తుల సౌకర్యార్థం ఆలయం ముందు, చెక్‌డ్యాం వద్ద, మొదటి బ్రిడ్జి దాటిన తర్వాత, ఘనపురం ఆనకట్ట వద్ద షవర్ బాత్‌లు ఏర్పాటు చేశారు. బట్టలు మార్చుకునేందుకు తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేస్తున్నారు.

231 పోలీసులతో భారీ బందోబస్తు

జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు ఏడుపాయల్లో డీఎస్పీ ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో 231 మంది పోలీసులతో భారీ బందోబస్తును ఏర్పాటు చేస్తున్నారు. భక్తుల సౌకర్యార్థం డాక్టర్ ప్రదీప్‌రావు ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు. ఇక ఆర్టీసీ మెదక్ డిపో నుంచి 8 ప్రత్యేక బస్సులు నడుపుతుంది.



ఏడుపాయల్లో అరకొరగా సాగుతున్న పనులు

ఆకుపచ్చ నీళ్లలోనే స్నానాలు

మంజీర పాయలు గుర్రపు డెక్క..మురికి నీటితో ఆకుపచ్చ రంగులోకి మారాయి. ఏడుపాయల్లోని వివిధ వాణిజ్య సముదాయాలు, ఆవాసప్రాంతాల నుంచి వస్తున్న మురికి నీటి కాలువలు ఏకంగా మంజీరలోకి వదులుతున్నారు. ఎగువన మంజీరా ప్రవాహంలో సైతం పరిశ్రమల నుంచి కలుషిత నీరు కలుస్తుంది. దీంతో మంజీరా నీరు ఆకుపచ్చ రంగులోకి మారింది. అవే నీటిలో భక్తులు పుణ్య స్నానం ఆచరించాల్సిన పరిస్థితి నెలకొంది.

రేపు మహిళా జాబ్ మేళా

డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ హుస్సేన్



మెదక్ కలెక్టరేట్: మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఈనెల 30న మహిళా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ హుస్సేన్ మంగళవారం తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ఎలక్ట్రానిక్ వస్తువుల తయారీ సంస్థ సౌజన్యంతో కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం, మహిళా సాధికారత విభాగం సంయుక్తంగా ఈ మేళా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. పదోతరగతి, ఇంటర్, డిగ్రీ పాసైన లేదా ఫెయిలైన విద్యార్థులు అర్హులన్నారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.12,152 వేతనంతో పాటు రూ.1,500 బోనస్, ఉచిత వసతి సౌకర్యం, భోజన వసతులు కూడా అందిస్తారని వివరించారు. ఎంపికైన వారికి రెండు నెలల పాటు ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. ఆసక్తి కలిగిన మహిళా అభ్యర్థులు జనవరి 30న ఉదయం 9.30 గంటల నుంచి కళాశాల ప్రాంగణంలో సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరుకావాలని కోరారు. పూర్తి సమాచారం కోసం జాబ్ మేళా సమన్వయకర్త చంద్రశేఖర్ (98491 52712) సంప్రదించాలని కోరారు.

తిప్పి కొట్టేందుకు సిద్ధం

కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి



మాట్లాడుతున్న కాంగ్రెస్ నేత రాజిరెడ్డి

నర్సాపూర్ : ప్రజా పాలన కార్యక్రమాల్లో వ్యతిరేక చర్యలకు పాల్పడితే వాటిని తిప్పి కొట్టేందుకు తాము సిద్ధంగా ఉన్నామని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌కు చెందిన స్థానిక ఎమ్మెల్యే సునీతారెడ్డి నియోజకవర్గంలో ప్రజా పాలన కార్యక్రమాలను వ్యతిరేకిస్తున్నారని, ప్రభుత్వ కార్యక్రమాలకు అడ్డుపడితే ఆమె చర్యలను తిప్పికొట్టేందుకు తమ పార్టీ కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నియోజకవర్గం అన్ని రంగాల్లో వెనుకబడిందన్నారు. ఎమ్మెల్యే సునీతారెడ్డికి పదవీ వ్యామోహం ఎక్కువని, బడుగు బలహీన వర్గాల ప్రజలంటే ఆమెకు నచ్చదని, వారి ఓట్లు మాత్రం కావాలని డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ విమర్శించారు. ఇటీవల జరిగిన వెంకటాపూర్ ప్రజాపాలన సభలో తోటి మహిళా ప్రజా ప్రతినిధి సుహాసినిరెడ్డి పట్ల ఎమ్మెల్యే సునీతారెడ్డి వ్యవహార తీరు సరిగా లేదని ఆక్షేపించారు. తోటి మహిళనని చూడకుండా తన చేతిలో నుంచి మైకు లాక్కోవడం ఎంత వరకు సమంజసమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ నాయకులు రిజ్వాన్, మల్లేశ్, మహేశ్‌రెడ్డి, శ్రీనివాస్ రావు, శ్రీనివాస్ గుప్తా, లలిత, అశోక్, చిన్న ఆంజిగౌడ్, రషీద్, నవీన్ గుప్తా, మణిదీప్ పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యనందించాలి

ఎంజేపీ బీసీ గురుకులాల ఆర్‌సీఓ గౌతమ్‌కుమార్

కౌడిపల్లి(నర్సాపూర్): విద్యార్థులు పదో తరగతి, ఇంటర్మీడియెట్‌లో వందశాతం ఫలితాలు సాధించాలని ఆర్‌సీఓ గౌతమ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని తునికి వద్దగల ఎంజేపీ బీసీ గురుకుల పాఠశాల, కళాశాలను ఉమ్మడి మెదక్ జిల్లా ఎంజేపీ బీసీ గురుకులాల ఆర్‌సీఓ ఆకస్మిక తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం, తరగతి గదులు, పరిసరాలు పరిశీలించారు. అనంతరం లెక్చరర్లు, ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి పరీక్షలకు సిద్ధం చేయాలన్నారు. చదువులో వెనకబడిన వారిని గుర్తించి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియెట్‌లో వందశాతం ఫలితాలు సాధించేలా కృషి చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హరిబాబు, వైస్ ప్రిన్సిపాల్ సుష్మ, జయరాజ్, ఉపాధ్యాయులు, లెక్చరర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్‌సీఓ గౌతమ్‌కుమార్

శత శాతం ఉత్తీర్ణత సాధించాలి

పదోతరగతి విద్యార్థులకు డీఈఓ ఉద్బోధ

పాపన్నపేట(మెదక్): పదోతరగతి పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా విద్యాశాఖాధికారి రాధాకిషన్ అన్నారు. మంగళవారం పాపన్నపేట మండల పరిధిలోని మల్లంపేట ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. పూర్తయిన సిలబస్‌ను రివిజన్ చేయాలని సూచించారు. ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులకు తప్పకుండా హాజరు కావాలని చెప్పారు. గత పరీక్ష పత్రాలను సాధన చేయాలన్నారు. విద్యార్థులకు పలు ప్రశ్నలు అడిగారు. వారు ఇచ్చిన సమాధానాలతో సంతృప్తి చెందారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. ఆయన వెంట ఏఎంఓ సుదర్శణ మూర్తి ఉన్నారు.

ఉత్తమ టీచర్ జీవితాంతం గుర్తుండి పోతారు

ఉత్తమ టీచర్లు విద్యార్థికి జీవితాంతం గుర్తుండి పోతారని జిల్లా విద్యాశాఖాధికారి రాధాకిషన్ అన్నారు. మంగళవారం కొత్తపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాంరెడ్డి పదవీ విరమణ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థి భవిష్యత్‌కు సోపానాలు నిర్మించే టీచర్లు.. పదవీ విరమణ చేసినా విద్యార్థి విజయం వెనుక గుర్తుకొస్తుంటారని చెప్పారు. రాంరెడ్డి సేవలు మరచి పోలేనివన్నారు. ఎంఈఓలు నీలకంఠం, ప్రతాప్ రెడ్డి, ధనుంజయ, ఏఎంఓ సుదర్శనమూర్తి, సైన్స్ ఆఫీసర్ రాజిరెడ్డి, గోపాల్ రెడ్డి, పీఆర్టీయూ నాయకులు రాజు, సురేష్, తుకారం, వెంకట్‌రాంరెడ్డి, టీచర్లు రాంరెడ్డి దంపతులను ఘనంగా సన్మానించారు.



మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి రాధాకిషన్

ప్రాథమిక స్థాయి నుంచే గుణాత్మక విద్య

- కార్యాచరణ రూపొందించండి
- డీఈవోకు కలెక్టర్ ఆదేశం

మెదక్ కలెక్టరేట్: రానున్న విద్యా సంవత్సరంలో మొదటి రెండు తరగతుల నుంచే ప్రాథమిక స్థాయి గుణాత్మక విద్య అందించే దిశగా కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ డీఈఓ రాధాకిషన్‌ను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ తన చాంబర్‌లో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరంలో ఇప్పటివరకు జిల్లాలో జరిగిన ప్రాథమిక స్థాయి విద్యాబోధన పురోగతిపై సెంట్రల్ స్క్వేర్ ఫౌండేషన్ సభ్యులు వివరాలు అందజేసినట్లు తెలిపారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని రాబోయే విద్యా సంవత్సరంలో మొదటి ద్వితీయ తరగతి నుంచి ప్రాథమిక స్థాయి గుణాత్మక విద్య అందించే దిశగా కార్యచరణ రూపొందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఈఓ రాధా కిషన్, అకాడమిక్ మానిటరింగ్ అధికారి సుదర్శన్ మూర్తి, సెంట్రల్ స్క్వేర్ ఫౌండేషన్ సభ్యులు ఈశ్వర్, నిషేత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రి ఆకస్మిక తనిఖీ

చిన్నశంకరంపేట(మెదక్): ప్రభుత్వాస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ సూచించారు. మంగళవారం చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓపీ పేషెంట్ల రిజిస్టర్, సిబ్బంది హాజరు పట్టిక, రక్త పరీక్ష రికార్డులు పరిశీలించారు. అనంతరం రోగులతో మాట్లాడి డాక్టర్లు అందిస్తున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ నెలలో ఎన్ని డెలివరీలు అయ్యాయని మెడికల్ ఆఫీసర్ సాయి సింధును ప్రశ్నించగా రెండు చేసినట్లుగా చెప్పారు. డెలివరీల సంఖ్యను పెంచాలని సూచించారు. వ్యాక్సినేషన్ వివరాలను అడిగి తెలుసుకున్నారు.



ప్రదర్శనను తిలకిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

ఏకాగ్రతతో చదవండి

కష్టపడి చదివితేనే మెరుగైన ఫలితాలు సాధించగలరని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. మంగళవారం చిన్నశంకరంపేట మోడల్‌స్కూల్‌లో ఎడ్యుకేషన్ ఫెస్టివల్‌లో భాగంగా విద్యార్థులు రూపొందించిన పరికరాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదో తరగతి, ఇంటర్ విద్యార్థులు నెల రోజులు చదువుపై ఏకాగ్రతతో ముందుకు సాగితే ఉత్తీర్ణత పొందగలరని అన్నారు. సబ్జెక్టుపై పట్టుసాధించిన విద్యార్థులు ఎలాంటి సమస్యనైనా తేలికగా అధిగమించగలరని చెప్పారు. కార్యక్రమంలో మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ వాణికుమారి, అధ్యాపకులు లింగం పాల్గొన్నారు.

ఉద్యోగి సర్వీస్ పెంచితే యువత ఎక్కడికి పోవాలి

- ప్రభుత్వానికి ఎంపీ రఘునందన్‌రావు ప్రశ్న
- మేధావి వర్గం ఆలోచించాలి
- టీఎన్‌జీవో క్యాలెండర్, డైరీ ఆవిష్కరించిన ఎంపీ, ఎమ్మెల్యే



టీఎన్‌జీవో క్యాలెండ్, డైరీని అవిష్కరిస్తున్న ఎంపీ రఘునందన్‌, ఎమ్మెల్యే సునీతా, టీఎన్జీవో నేతలు

మెదక్‌జోన్: బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు దొందూ దొందేనని ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. మంగళవారం మెదక్ పట్టణంలోని టీఎన్‌జీవో భవన్‌లో ఏర్పాటు చేసిన స్టాండింగ్ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యోగి సర్వీస్ 57 నుంచి 60 సంవత్సరాలకు పెంచితే.. కాంగ్రెస్ ప్రభుత్వం 65 సంవత్సరాల వరకు పొడిగించేందుకు సిద్ధంగా ఉందన్నారు. అదే జరిగితే యువత ఎక్కడి పోవాలని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వ ఉద్యోగి రిటైర్మెంట్ అయిన తర్వాత నెలరోజుల్లో తనకు రావాల్సిన బెనిఫిట్స్‌ను ప్రభుత్వం తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై ఉద్యోగులంతా ఏకగ్రీవ తీర్మానం చేయాలని కోరారు. ఉద్యోగులు, జర్నలిస్టుల కోసం హెల్త్ కార్డులను ఇవ్వటంతో పాటు ఇన్సూరెన్స్ డబ్బులను ప్రభుత్వమే చెల్లించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ అయ్యాక ఏడాది వరకు కూడా తనకు రావాల్సిన బెనిఫిట్స్ రావటం లేదని ఓ ఉద్యోగి సోషల్‌మీడియా ద్వారా తన బాధను వెలిబుచ్చుకోవడం బాధాకరమని వ్యాఖ్యానించారు. ఈ విషయాల్లో మేధావివర్గం మౌనం వహిస్తే దేశానికి నష్టం జరుగుతుందని పేర్కొన్నారు. మెదక్‌ను రాజన్నసిరిసిల్ల జోన్ కొనసాగిస్తే ఉద్యోగ అవకాశాలు పోతాయని, చార్మినార్‌జోన్‌లో కలిపే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు ఉద్యోగులు ఎంపీని కోరారు. జోనల్ మార్పు కోసం కృషి చేస్తానని ఎంపీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, టీఎన్‌జీవో మాజీ అధ్యక్షుడు దేవీప్రసాద్, జిల్లా అధ్యక్షుడు నరేందర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్లాస్టిక్ నివారణకు కృషి చేయండి : డీపీఓ



శానిటరీ కప్‌లను అందిస్తున్న డీపీఓ దేవకీదేవి

హుస్నాబాద్‌రూరల్: గ్రామీణ మహిళలు ప్లాస్టిక్ నివారణకు కృషి చేయాలని జిల్లా పంచాయతీ అధికారిణి దేవకీదేవి అన్నారు. మంగళవారం తోటపల్లిలో నిర్వహించిన రుతు ప్రేమ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డీపీఓ మాట్లాడుతూ.. ఇళ్లలో ప్లాస్టిక్‌ను నిషేధించి స్టీల్, పేపర్, క్లాత్ బ్యాగులను ప్రోత్సహించాలన్నారు. మహిళల ఆరోగ్యం కోసం, పర్యావరణ పరిరక్షణకు రుతు ప్రేమ కార్యక్రమం చేపట్టామన్నారు. ప్లాస్టిక్ కెమికల్స్ కలిగిన ప్యాడ్స్ వల్ల మహిళల ఆరోగ్యంతోపాటు పర్యావరణం దెబ్బతింటుందన్నారు. మెడికల్ గ్రేడ్ సిలికాన్ తయారు చేసిన శానిటరీ కప్‌లను ఉపయోగించాలన్నారు. కార్యక్రమంలో డీఎల్పీఓ వెంకటేశ్వర్లు, మార్కెట్ వైస్ చైర్మన్ బంక చందు, ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీఓలు రమేశ్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ట్రేడింగ్ పేరుతో రూ.20 లక్షలు స్వాహా

పటాన్‌చెరు టౌన్: నకిలీ ఆన్‌లైన్ ట్రేడింగ్‌తో ఓ మహిళ రూ.20 లక్షలు పోగొట్టుకున్న ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. అమీన్‌పూర్ పోలీసుల కథనం మేరకు.. అమీన్‌పూర్‌కు చెందిన ప్రైవేట్ ఉద్యోగినికి డిసెంబర్ 13వ తేదీన ట్రేడింగ్‌కు సంబంధించి ఓ మెసేజ్ వచ్చింది. ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో అకౌంట్ కోసం తన వివరాలను యాప్‌లో నమోదు చేసి ఆన్‌లైన్‌లో పెట్టుబడి పెడుతూ వచ్చింది. బాధితురాలు పలు దఫాలుగా రూ.20 లక్షలు పెట్టుబడి పెట్టి, తాను పెట్టిన నగదుతోపాటు రెట్టింపైన నగదును ఇవ్వాలని అడిగింది. అపరిచిత వ్యక్తులు స్పందించకపోవడంతో బాధితురాలు తాను మోసపోయినట్లు గుర్తించి ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అనంతరం అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

రైతు వేదికలో చోరీ

రేగోడ్(మెదక్): రైతు వేదికలో దొంగలు చోరీకి పాల్పడిన ఘటన మండలంలోని టీ.లింగంపల్లిలో మంగళవారం వెలుగు చూసింది. ఎస్‌ఐ పోచయ్య కథనం ప్రకారం.. లింగంపల్లి గ్రామ ఏఈఓగా సుభాష్ విధులు నిర్వహిస్తున్నాడు. ప్రతీ మంగళవారం రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేస్తారు. ప్రతీ వారంలాగే నిన్న రైతు వేదిక వద్దకు వెళ్లగా తాళం పగులకొట్టి ఉంది. కార్యాలయంలోకి వెళ్లి చూడగా వీడియో కాన్ఫరెన్స్‌కు సంబంధించిన రెండు స్పీకర్‌లు, ఆరు మైక్‌లు, కీబోర్డు, మౌస్ కనిపించలేదు. దొంగలు చోరీకి పాల్పడినట్లు గుర్తించి ఏఈఓ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

చిన్నశంకరంపేట(మెదక్): రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ఘటన పేట మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. పేటలోని బీసీ కాలనీలో నివాసం ఉండే సిరిగద్దె సత్తయ్య టీవీఎస్ ఎక్సెల్‌పై చౌరస్తాకు వెళ్తుడు. ఇదే సమయంలో వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సత్తయ్యకు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం స్థానికులు ఆస్పత్రికి తరలించారు.

బాలికల్లో ఆరోగ్యంతోపాటు ఆత్మ స్థైర్యాన్ని నింపేందుకు కేంద్ర ప్రభుత్వం ఐదేళ్ల కిందట తెచ్చిన బాలికల సమగ్ర పథకం సత్ఫలితాలనిస్తోంది. ప్రతీయేటా వేల సంఖ్యల్లో బాలికలకు శిక్షణ ఇవ్వడంతో వారిలో శారీరక, మానసిక దృఢత్వం పెరుగుతుంది. ఈ నేపథ్యంలో ప్రస్తుత సంవత్సరం నుంచి రాణీ లక్ష్మీబాయ్ ఆత్మరక్ష శిక్షణ పథకంగా పేరు మార్చడంతోపాటు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది.

– నంగునూరు(సిద్దిపేట)



నంగునూరులో కరాటేలో శిక్షణ పొందుతున్న బాలికలు

కరాటే శిక్షణ.. ఆత్మరక్షణ

- సత్ఫలితాలనిస్తున్న 'బాలికల సమగ్ర పథకం'
- ఇటీవలె పేరు మార్చి నిధులు మంజూరు చేసిన కేంద్రం
- సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా 258 పాఠశాలలు ఎంపిక
- మూడు నెలలపాటు ప్రత్యేక శిక్షకుడితో తర్ఫీదు
- ఆరోగ్యంతోపాటు ఆత్మస్థైర్యం పెంపు

మహిళలు, బాలికలపై దాడులు అరికట్టేందుకు జూడో, కరాటే, మార్షల్ ఆర్ట్స్, బేసికల్ డిఫెన్స్ టెక్నిక్, స్వీయరక్షణ పద్ధతులు ఎంతో ఉపయోగపడుతాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం 6 నుంచి 14 ఏళ్లలోపు బాలికలకు ఆత్మరక్షణ విద్యను తప్పనిసరిగా చేయాలని సంకల్పించింది. 2020లో కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ అండ్ లిటరసీ (డీఓఎస్‌ఈఎల్) సమగ్ర శిక్షణ పథకాన్ని అమలు చేస్తోంది. ఇందులో భాగంగా 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు ప్రభుత్వ పాఠశాలతో పాటు సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలు, కస్తూర్బాగాంధీ పాఠశాలలో చదువుతున్న బాలికలకు కరాటేలో శిక్షణ ఇస్తున్నారు.

రాణీ లక్ష్మీబాయి ఆత్మరక్ష శిక్షణ

గతేడాది ఈ పథకం గడువు ముగియడంతో ప్రభుత్వం పథకాన్ని మరోసారి పొడిగిస్తూ రాణీ లక్ష్మీబాయి ఆత్మరక్ష శిక్షణ కార్యక్రమంగా పేరు మార్చింది. నిర్వహణ కోసం రూ 38.7 లక్షలు మంజూరు చేయడంతోపాటు కరాటే శిక్షకుడికి గౌరవ వేతనాన్ని నెలకు రూ.5 వేలు పెంచారు. ఈ ఏడాదికిగాను సిద్దిపేట జిల్లాలోని 258 పాఠశాలలను పథకం కింద ఎంపిక చేశారు. వీటిలో 203 ఉన్నత, 13 ప్రాథమికోన్నత పాఠశాలలు, 16 సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలు, నాలుగు తెలంగాణ ఆదర్శ పాఠశాలలు, 22 కస్తూర్బాగాంధీ పాఠశాలలను ఎంపిక చేశారు.



కరాటే నేర్చుకుంటున్న విద్యార్థినులు



మూడు నెలలపాటు

శిక్షణ కింద ఎంపికైన పాఠశాలల్లో నవంబర్ నుంచి ఫిబ్రవరి వరకు మూడు నెలల పాటు శిక్షణ ఇస్తున్నారు. ఒక్కో సెషన్‌లో 50 నిమిషాల పాటు మెళకువలు నేర్పిస్తారు. నెలకు 12 సెషన్ల చొప్పున మూడు నెలల కాలంలో 36 సెషన్లలో శిక్షణ కాలం పూర్తవుతుంది. శిక్షణలో శారీరక దృఢత్వం పెరుగుదల, ఆపద సమయంలో ఎలా స్పందించాలి, దాడి చేస్తే ప్రతిదాడి చేసే టెక్నిక్‌లు నేర్చుకుంటున్నారు. మండలంలోని నర్మేటలో గల కస్తూర్బా పాఠశాలలో కరాటే శిక్షకురాలిగా బీ.అనిత, పాలమాకుల, నంగునూరు, రాజగోపాల్‌పేట, బద్దిపడగ, గట్లమల్యాల, నర్మేట, మగ్దుంపూర్, అంక్షాపూర్ ఉన్నత పాఠశాలలో ఎల్లదాసు విద్యార్థులకు కరాటేలో శిక్షణ ఇస్తున్నారు.

బాలికలు తప్పనిసరిగా నేర్చుకోవాలి



రెండు నెలలుగా కరాటే నేర్చుకోవడంతో నాలో ధైర్యం పెరిగింది. ఎవరైనా దాడి చేస్తే ఎలా రక్షించుకోవాలో తెలిసింది. అలాగే ఆయుధాలు లేకుండా ఎలా ఎదుర్కోవాలో శిక్షణలో నేర్చుకున్నా. బాలికలు తప్పనిసరిగా కరాటే నేర్చుకోవాలి.

– జీ.భవ్యసాయి, విద్యార్థి, మగ్దుంపూర్

ఆత్మస్థైర్యం పెరుగుతోంది

విద్యార్థినులకు కరాటే నేర్పించడం వల్ల ఆరోగ్యంతోపాటు ఆత్మస్థైర్యం పెరుగుతుంది. ఎవరైనా దాడులు చేస్తే ఎలా స్పందించాలి, ఎలా తిప్పికొట్టాలో నేర్పిస్తున్నా. ఐదేళ్లుగా స్కూళ్లలో కరాటే నేర్పిస్తూ ఎంతో మంది బాలికలకు శిక్షణ ఇవ్వడం సంతృప్తినిచ్చింది.

– ఎల్లదాసు, కరాటే శిక్షకుడు

25 వేల మందికి శిక్షణ



సిద్దిపేట జిల్లాలోని 258 పాఠశాలల్లో సమగ్ర శిక్ష ద్వారా ఆత్మరక్షణ విద్యను అమలు చేస్తున్నాం. మొత్తం కలిపి 25 వేల మంది విద్యార్థినులు కరాటేలో మెళకువలు నేర్చుకుంటున్నారు. రాణీ లక్ష్మీబాయి ఆత్మరక్ష శిక్షణ పథకాన్ని పటిష్టంగా అమలయ్యేలా కృషి చేస్తాం.

– ఎల్లంకి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా విద్యాధికారి, సిద్దిపేట

కొమురవెల్లిలో అఘోరీ హల్‌చల్

- జనంపై కత్తితో దాడి, ఒకరికి తీవ్రగాయాలు
- ఓ విలేకరి సెల్‌ఫోన్ ధ్వంసం

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి దర్శనానికి వచ్చిన అఘోరీ (నాగసాధువు) మంగళవారం హల్‌చల్ చేసింది. కత్తితో జనంపైకి దూసుకువచ్చి దాడికి పాల్పడింది. ఈ క్రమంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. భక్తులందరూ భయభ్రాంతులకు గురయ్యారు. ముందుగా ఆలయంలోకి వెళ్లి స్వామి వారిని దర్శించుకునేందుకు ప్రయత్నించింది. దిగంబరంగా కాకుండా వస్త్రాలు ధరించి స్వామి వారిని దర్శించుకుకోవాలని ఆలయ అధికారులు సూచించారు. దీంతో కోపోద్రిక్తురాలైన అఘోరీ ఒక్క సారిగా కత్తిని చేత పట్టుకుని హంగామా సృష్టించింది. ఈక్రమంలో స్థానికునికి తీవ్రగాయాలయ్యాయి. అక్కడే ఉండి వీడియో చిత్రీకరిస్తున్న ఓ విలేకరి సెల్‌ఫోన్ లాక్కొని ధ్వంసం చేసింది. అంతే కాకుండా ప్రజలను తీవ్ర పదజాలంతో దూషించింది. అనంతరం తన వద్ద ఉన్న నల్లని వస్త్రాలు ధరించి స్వామి వారిని దర్శించుకున్నారు. పోలీసులు అక్కడికి చేరుకుని అఘోరీని పంపించడంతో సమస్య సద్దు మణిగింది. అఘోరీలు దైవ మార్గంలో ఉంటూ భక్తులకు మార్గదర్శకంగా ఉండాల్సింది పోయి భక్తులపై దాడి చేయడం ఏమిటని స్థానికంగా చర్చనీయంశమైంది. అఘోరీ కొంత కాలంగా తెలుగు రాష్ట్రాలలో ఉద్రిక్తతలు సృష్టిస్తున్న విషయం విధితమే.



కత్తితో హల్‌చల్ చేస్తున్న అఘోరీ

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

గజ్వేల్‌రూరల్: ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మంగళవారం వెలుగుచూసింది. గజ్వేల్ పోలీసుల కథనం మేరకు.. మున్సిపాలిటీ పరిధిలోని ఆర్అండ్ఆర్ కాలనీ(వేములఘట్)కు చెందిన తలమైన సత్తయ్య(45)కు 20 ఏళ్ల కిందట రేఖతో వివాహం జరుగగా వీరికి కుమారుడు ఉన్నాడు. రేఖ కాలికి గాయం కావడంతో కొంతకాలంగా తల్లి గారింటి వద్ద ఉంటుంది. కుమారుడు హాస్టల్‌లో చదువుకుంటున్నాడు. భార్య రేఖకు ఫోన్ చేసినా ఇంటికి రాకపోవడంతో ఇద్దరి మధ్య అప్పుడప్పుడూ గొడవ జరుగుతుండేది. ఆర్థిక ఇబ్బందులకు తోడు కుటుంబ కలహాలతో తీవ్ర మనోవేదనకు గురైన సత్తయ్య ఆదివారం రాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంట్లో నుంచి దుర్వాసన వస్తుండడంతో గమనించిన చుట్టుపక్కల వారు రేఖకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

చెరువులో దూకి వృద్ధురాలు

రామాయంపేట(మెదక్): చెరువులో దూకి వృద్ధురాలు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన రామాయంపేటలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ బాల్‌రాజ్ కథనం మేరకు.. పట్టణానికి చెందిన చాకలి పోచవ్వ (75) ఏడాది కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతుంది. ఆమె కుమారుడు పలు ఆస్పత్రుల్లో చూపించినా తగ్గలేదు. రాత్రి అందరూ పడుకున్న తర్వాత ఇంటిలో నుంచి వెళ్లిపోయిన పోచవ్వ మల్లె చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి కుమారుడు యాదగిరి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కుష్టు వ్యాధిపై అవగాహన అవసరం

జిల్లా లెప్రసీ అధికారి డాక్టర్ నవీన్ కుమార్

మెదక్‌జోన్: కుష్టు వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, ఇందుకోసం గ్రామ గ్రామాన విస్తృతంగా సమావేశాలను ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా లెప్రసీ అధికారి డాక్టర్ నవీన్ కుమార్ తెలిపారు. జాతీయ కుష్టువ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మంగళవారం కలెక్టరేట్‌లోని వైద్యారోగ్య కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 30 నుంచి ఫిబ్రవరి 13 వరకు కుష్టు వ్యాధిపై అవగాహన కార్యక్రమాలు కొనసాగిస్తామని అన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ , ప్రైవేట్, పాఠశాలలు, కళాశాలలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో విద్యార్థులకు కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 31 మంది వ్యాధిగ్రస్తులు చికిత్స పొందుతున్నారని అన్నారు. కుష్టు వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో పారా మెడికల్ అధికారి శంకర్ రాథోడ్, డీపీఎంఓలు జాఫర్, లక్ష్మణ్, రాములు, సంతోష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ నవీన్ కుమార్

ఫిర్యాదుదారులతో మర్యాదగా మట్లాడాలి

- సిద్దిపేట సీపీ అనురాధ
- వన్‌టౌన్, మహిళా పోలీస్‌స్టేషన్ సందర్శన

సిద్దిపేటకమాన్: ఫిర్యాదు దారులతో మర్యాదగా మట్లాడి సాధ్యమైనంత త్వరగా వారి సమస్యలు పరిష్కరించాలని సిద్దిపేట సీపీ అనురాధ తెలిపారు. వార్షిక తనిఖీల్లో భాగంగా సిద్దిపేట వన్ టౌన్, మహిళా పోలీస్‌స్టేషన్‌ను సీపీ మంగళవారం సందర్శించారు. పోలీస్‌స్టేషన్ చుట్టూ పరిసర ప్రాంతాలు, సీజ్ చేసిన వాహనాలు, రిసెప్షన్, రైటర్ రూమ్, స్టేషన్ రికార్డులు, సీడీ ఫైల్స్ పరిశీలించి, పీఎస్ ఆవరణలో ఆమె మొక్కను నాటారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. పోలీసు స్టేషన్‌లో వివిధ కేసుల్లో ఉన్న వాహనాల చిరునామా తెలుసుకొని సంబంధిత యజమానులకు అప్పగించాలన్నారు. ఇసుక, జూదం, పీడీఎస్ రైస్ అక్రమ రవాణా జరగకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడూ కేసులు నమోదు చేయాలన్నారు. విజబుల్ పోలిసింగ్‌పై దృష్టి సారించాలన్నారు. పాత నేరస్థులు, కేడీలు, రౌడీలను తరచుగా తనిఖీలు చేయాలని, వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. సిద్దిపేట వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణ పచ్చదనంతో బాగుందని సీఐ వాసుదేవరావును సీపీ అభినందించారు. మహిళా పోలీసు స్టేషన్‌కు వచ్చే దరఖాస్తులను పరిశీలించి భార్యాభర్తలకు, వారి కుటుంబ సభ్యులకు కౌన్సిలింగ్ చేయాలని కుటుంబాలను నిలబెట్టే విధంగా కృషి చేయాలని అన్నారు. టాస్క్‌ఫోర్స్ అధికారులు గంజాయి, మత్తు పదార్థాలను నిర్మూలించి గంజాయి రహిత జిల్లాగా కృషి చేయాలన్నారు. పోలీసు సబ్సిడరీ క్యాంటీన్‌ను సందర్శించి స్టాక్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో సిద్దిపేట ఏసీపీ మధు, వన్ టౌన్ సీఐ వాసుదేవరావు, మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ దుర్గ, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్లు రమేశ్, జానకీ రామ్ రెడ్డి, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్లు శ్రీధర్ గౌడ్, కోర్టు లైజనింగ్ ఎస్‌ఐ నర్సింహా రావు, పీఆర్‌ఓ మల్లికార్జున్‌రెడ్డి, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



సిద్దిపేట వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో వివరాలు తెలుసుకుంటున్న సీపీ అనురాధ

గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తి అరెస్ట్

కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్

కొండపాక(గజ్వేల్): గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో కేసుకు సంబంధించిన వివరాలను తొగుట ఎస్సై రవికాంత్‌రావుతో కలిసి వెల్లడించారు. బీహార్ రాష్ట్రానికి చెందిన సుధీర్‌కుమార్(26) మూడు నెలల కిందట మేదినీపూర్ గ్రామ శివారులో సంతోష్‌కుమార్‌కు చెందిన డెయిరీ ఫామ్‌లో కూలీ పనికి చేరాడు. పనిలో చేరేటప్పుడే గుర్తు తెలియని వ్యక్తుల నుంచి గంజాయిని కొనుగోలు చేసుకొని వచ్చాడు. పని ముగిసిన తర్వాత రోజూ గంజాయి తాగేవాడు. మేదినీపూర్ శివారులోని పెద్దమ్మ తల్లి దేవాలయం వద్ద కొందరు యువకులు గుమిగూడటంతో తన వద్ద ఉన్న 109 గ్రాముల గంజాయిని వారికి అమ్ముదామని వచ్చాడు. సమాచారం తెలుసుకున్న ఎస్సై శ్రీనివాస్ పోలీసులతో దేవాలయం వద్దకు వెళ్లగా సుధీర్ కుమార్ అనుమానాస్పదంగా కనిపించడంతో పట్టుకొని గంజాయి స్వాధీనం చేసుకున్నారు. దాని విలువ సుమారు రూ.2,200 వరకు ఉంటుంది. సులభంగా డబ్బు సంపాదించాలన్న ఆశతో సుధీర్ కుమార్ గంజాయి విక్రయించేందుకు అలవాటు పడ్డాడని తెలిపారు. కేసు నమోదు చేసుకొని సిద్దిపేట కోర్టులో నిందితుడిని హాజరు పర్చగా కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.



వివరాలను వెల్లడిస్తున్న ఎస్సై శ్రీనివాస్

పొలంలో పడి యువ రైతు మృతి



చేతన్ (ఫైల్)

వెల్దుర్తి(తూప్రాన్): వ్యవసాయ పొలం గట్టుపై నుంచి ప్రమాదవశాత్తు జారిపడి యువరైతు మృతి చెందిన ఘటన వెల్దుర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ రాజు కథనం మేరకు.. మాసాయిపేట మండలం హకీంపేట గ్రామానికి చెందిన పత్తి చేతన్(35) రోజుమాదిరిగా పిల్లలను బడికి పంపించి మంగళవారం ఉదయం వ్యవసాయ పనుల కోసం గ్రామ శివారులోని పొలం వద్దకు వెళ్లాడు. కొద్దిసేపటికి భార్య రజిత ఫోన్ చేయగా లిఫ్ట్ చేయలేదు. చేతన్ సోదరుడు వెంకటేశ్‌తో కలిసి పొలం వద్దకు వెళ్లింది. అక్కడ వెతుకుతుండగా పొలంలో బోర్లాపడి చనిపోయి కనిపించాడు. పంటచేనులో నీరు చూడడానికి వెళ్లి ప్రమాదవశాత్తు బురదలో పడి ఊపిరాడకపోవడంతో మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

లారీ ఢీకొని బైకిస్టు..

వర్గల్(గజ్వేల్): బైక్‌ను లారీ ఢీకొట్టడంతో బైకిస్టు మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం గజ్వేల్–తూప్రాన్ రహదారిపై వర్గల్ మండలం అనంతగిరిపల్లి వద్ద చోటు చేసుకుంది. గౌరారం ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి కథనం మేరకు.. నాచారం గ్రామానికి చెందిన కొత్తపల్లి వెంకటేశ్ (46) తూప్రాన్ నుంచి బైక్ మీద సాయంత్రం ఇంటికొస్తున్నాడు. అనంతగిరిపల్లి రోడ్డు వద్ద గజ్వేల్ నుంచి తూప్రాన్ వైపు వస్తున్న లారీ, బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెంకటేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుమారుడు శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌పై కేసు నమోదుచేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.



వెంకటేశ్ మృతదేహం

చికిత్స పొందుతూ గృహిణి..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గృహిణి మృతి చెందిన ఘటన కొల్లూరులో చేటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం బీహార్ రాష్ట్రానికి చెందిన సరాయి ఖతుర్ (20)కి అదే రాష్ట్రానికి చెందిన జాంగీర్‌తో వివాహం జరిగింది. వీరికి ఏడాది బాబు ఉన్నాడు. గతేడాది జీవనోపాధికి తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని కొల్లూరుకు వలసొచ్చారు. స్థానికంగా కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. 26న భార్యాభర్తల మధ్య గొడవ జరగడంతో ఖతుర్ గదిలో చీరతో ఉరేసుకుంది. చుట్టుపక్కల గమనించి కిందకి దింపి రక్షించారు. తిరిగి 27న ఊపిరి తీసుకోవడం కష్టంగా ఉందని భర్తకు చెప్పడంతో గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందింది. మంగళవారం మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మత్తు పదార్థాలపై పటిష్ట నిఘా

- సిద్దిపేట త్రీటౌన్ సీఐ విద్యాసాగర్
- నార్కోటిక్ డాగ్స్‌తో తనిఖీ

సిద్దిపేటఅర్బన్: గంజాయి, ఇతర మత్తు పదార్థాలపై పటిష్టమైన నిఘా ఏర్పాటు చేశామని, గంజాయి రహిత జిల్లాగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సిద్దిపేట త్రీటౌన్ సీఐ విద్యాసాగర్ పిలుపునిచ్చారు. మంగళవారం సిద్దిపేట త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రంగదాంపల్లిలో మత్తు పదార్థాల నివారణ కోసం అనుమానాస్పద ప్రాంతాల్లో నార్కోటిక్స్ డాగ్స్‌తో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. గంజాయి, ఇతర మత్తు పదార్థాలు కలిపిన చాక్లెట్స్ ఎవరైనా కలిగి ఉన్నా, అక్రమంగా రవాణా చేసినా, పాన్ షాపులు, కిరాణా షాపుల్లో విక్రయించినా చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మత్తు పదార్థాలు ఎవరి వద్దనైనా కలిగి ఉన్నట్లు తెలిస్తే వెంటనే డయల్ 100కు సమాచారం అందించాలని కోరారు. తనిఖీల్లో త్రీటౌన్ ఎస్సై తిరుపతిరెడ్డి, డాగ్ స్క్వాడ్ సిబ్బంది కరుణాకర్, శ్యామ్, పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



నార్కోటిక్ డాగ్స్‌తో తనిఖీ చేయిస్తున్న పోలీసులు

వేర్వేరు చోట్ల ముగ్గురు అదృశ్యం

స్కూల్ వెళ్తున్నానని వెళ్లి బాలిక..

పటాన్‌చెరు టౌన్: బాలిక అదృశ్యమైన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఓ కాలనీకి చెందిన బాలిక (12) మంగళవారం స్కూల్‌కి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు స్కూల్ యజమాన్యాన్ని అడుగగా రాలేదని చెప్పారు. బాలిక కుటుంబ సభ్యులు తెలిసిన వారి వద్ద స్థానికంగా వెతికినా ఆచూకీ లభించలేదు. బాలిక అదృశ్యంపై కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పెద్దనాన్న ఇంటికెళ్తున్నానని యువతి

యువతి అదృశ్యమైన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పటాన్‌చెరు మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి (21) డిగ్రీ పూర్తి చేసి ఇంట్లోనే ఉంటుంది. 27న పెద్దనాన్న ఇంటికి వెళ్తున్నానని చెప్పి వెళ్లింది. సాయంత్రమైనా తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు పెద్దనాన్న ఇంటి వద్ద తెలుసుకోగా రాలేదని చెప్పారు. స్నేహితుల ఇళ్ల వద్ద, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. అదే గ్రామానికి చెందిన యువకుడు సుభాష్ పై అనుమానం ఉందని అతనూ కనబడటం లేదని పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ లో తండ్రి మంగళవారం ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇంటి వెళ్లి వ్యక్తి..

మునిపల్లి(అందోల్): ఇంటి వెళ్లి వ్యక్తి అదృశ్యమైన ఘటన సదాశివపేట మండలం మాలపహాడ్ గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. తలారి మోమన్ బుస్సారెడ్డిపల్లి గ్రామ శివారులో కట్టెలు తెస్తానని ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు, బంధువులు వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. బుస్సారెడ్డిపల్లి గ్రామ శివారు సింగూర్ ప్రాజెక్టు 17 గేటు దగ్గర బోటులో తలారి మోహన్ దుస్తులు, చెప్పులు, గొడ్డలి ఉన్నట్లు గుర్తించారు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ రాజేశ్ నాయక్ తెలిపారు. మోమన్ తల్లి తలారి పూలమ్మ మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బాలలపై హింసను అరికట్టాలి

- మెదక్ అదనపు ఎస్పీ మహేందర్
- లింగ ఆధారిత హింస నిర్మూలనపై సమీక్ష సమావేశం

మెదక్ మున్సిపాలిటీ: సమాజంలో బాలలపై జరుగుతున్న ఆకృత్యాలను అరికట్టడంలో ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పని చేయాలని జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ కోరారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని మాయా గార్డెన్స్‌లో మహిళా శిశు సంక్షేమ శాఖ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థల సహకారంతో ప్లాన్ ఇండియా స్వచ్ఛంద సంస్థ వారు లింగ ఆధారిత హింస నిర్మూలనపై సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి అదనపు ఎస్పీ మహేందర్, సీనియర్ సివిల్ జడ్జ్ జితేందర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. బాలల సంరక్షణ కోసం నాల్సా స్కీమ్ 2024లో భాగంగా జిల్లాలో ఎల్సీయూసీని ప్రారంభించినట్లు తెలిపారు. బాలలపై హింసను నిరోధించేందుకు సమాజంలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉందన్నారు. పిల్లల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించాలని, దీని ద్వారా తోటి విద్యార్థుల్లో కూడా ఆత్మ స్థైర్యం పెంపొందించవచ్చని తెలిపారు. అనంతరం జిల్లా బాలల సంరక్షణ అధికారి కరుణ శీలా మాట్లాడుతూ.. జిల్లాలో బాలలకు సంబంధించి మిషన్ వాత్సల్య కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అనాథ పిల్లల సంరక్షణలో తీసుకుంటున్న సేవల గురించి వివరించారు. కార్యక్రమంలో జిల్లాలోని న్యాయమూర్తులు, భరోసా, సఖీ, షీ టీం, విద్యాశాఖ, ప్లాన్ ఇండియా ప్రాజెక్టు నుంచి సీనియర్ ప్రాజెక్ట్ లీడ్ సుధీర్ కుమార్ రాయ్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ రాహుల్, ప్రాజెక్ట్ ఆఫీసర్ సుజాత రాజ్, వెంకటేశ్వర్లు, సోషల్ వర్కర్స్ మంజుల, భార్గవి, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో అదనపు ఎస్పీ మహేందర్, సీనియర్ సివిల్ జడ్జి జితేందర్, తదితరులు